క్లుప్తంగా

తొండమానపురంలో శ్రీవారి లడ్డూలు



ఆలయానికి చేరిన తిరుమల లడ్డూలు

శ్రీకాళహస్తి రూరల్: భక్తులు ఎంతో పవిత్రంగా స్వీకరించే తిరుమల లడ్డులను సామాన్య భక్తులకు చేరువ చేసేందుకు టీటీడీ పూనుకుంది. తిరుమల–తిరుపతి దేవస్థానం అనుసంధానమైన ఆలయాల్లో శ్రీవారి లడ్డూలను అందుబాటులోకి తీసుకువచ్చింది. శ్రీకాళహస్తి మండలం తొండమానపురంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వారానికోసారి 250 నుంచి 500 లడ్డులను టీటీడీ అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుందని, ఇక నుంచి శ్రీవారి ప్రసాదం అందుబాటులో ఉంటుందని, కావలసిన భక్తులు ఆలయంలో పొందవచ్చని ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ రెడ్డి తెలిపారు.

ముగిసిన గీతా ప్రవచనం



శ్రేయానంద సరస్వతిస్వామిని సన్మానిస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో శుక బ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగవద్గీతలో నిర్ధర్మయోగం ప్రవచన కార్యక్రమం సోమవారం ముగిసింది. ఉపన్యాసకులు శ్రేయానంద సరస్వతి స్వామిని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సత్కరించి శ్రీకాళహస్తీశ్వరస్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రత్నం రెడ్డి, జనార్దన్, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లీలాకుమారి

ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో సోమవారం రాస్, తిరుపతి నవజీవన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వికృతమాల, ఎస్సీ కాలనీ, మర్రిమంద తదితర గ్రామాల నుంచి వచ్చిన 145 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 45 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారికి రెండు రోజుల్లో తిరుపతిలోని నవజీవన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాస్ ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, డాక్టర్ లీలాకుమారి, రాస్ ప్రతినిధులు వెంకట్‌కుమార్, ముని పార్థసారథి, రేవతి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

నాగలాపురం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన నాగలాపురం వెస్టు దళితవాడకు చెందిన ప్రేమ్‌కుమార్‌ను సోమవారం సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ పిల్లలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో గురువు కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస యాదవ్, దేశప్పన్, సెల్వకుమార్, పార్థిబన్, ఎస్.ఎం.సురేష్, పరశురాం, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మన్నసముద్రంలో..

ఏర్పేడు: సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత, ఉత్తమ ఉపాధ్యాయునికి సోమవారం మన్నసముద్రంలో గ్రామస్తులు ఘన సన్మానం చేశారు. మండలంలోని మన్నసముద్రానికి చెందిన ఉపాధ్యాయుడు గుమ్మడి మురళి విద్యారంగం, సామాజిక సేవారంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామస్తులు ఆయనను సన్మానించారు.

వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కోలా ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి: మంత్రి సత్యకుమార్ జన్మదినం పురస్కరించుకుని సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్థానిక భరద్వాజతీర్థం వద్ద ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులు, సెక్యూరిటీ సిబ్బంది, స్వీపర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్వీ రమణ, గరికపాటి రమేష్, కొండేటి గోపాల్, అమర్‌నాథ్, వాసు యాదవ్, ఢిల్లీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రద్దు చేయాలని తీసుకున్న నిర్ణయంతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. ఇతర రాష్ట్రాల్లో మెడికల్ కళాశాలలకు అనుమతి రాక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ అనుమతి వచ్చిన కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూడడం దారుణం. టీడీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగానే మిగులుతుంది.

– టి.హర్షిత, బైపీసీ విద్యార్థిని, సత్యవేడు



మధ్యతరగతి విద్యార్థులకు తీరని నష్టం



మెడికల్ కళాశాలను ప్రయివేట్ పరం చేయడం వల్ల మధ్య తరగతి, మెరిట్ కలిగిన పేద విద్యార్థులు నష్టపోతారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు రూ.లక్షల్లో ఫీజులు చెల్లించలేక వైద్య విద్యకు దూరం అవుతారు. కొత్త కళాశాలలు ఏర్పాటుచేస్తే సీట్లు పెరిగి పేదవారు కూడా డాక్టర్లు కావడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎంతో మంది విద్యార్థులు నష్టపోతారు.

– దేవి, బైపీసీ విద్యార్థిని, సత్యవేడు

పంచాయతీలకు నిధులు విడుదల

- 15వ ఆర్థిక సంఘం నిధులు రెండవ విడత రూ.9.84 కోట్లు మంజూరు
- గ్రామాల్లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి అవకాశం
- పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఆధారంగా పనులు

వరదయ్యపాళెం: పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. వీటిలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించడం, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. గ్రామ పంచాయతీల పాలక వర్గాలు ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 9,84,50,562 జమ చేసింది. వీటికి 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఆయా పంచాయతీల ఖాతాల్లో పీఎఫ్ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా రెండవ విడత నిధులు జమ చేసింది.

299 పంచాయతీలకు లబ్ధి

సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో 299 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటికి 2022–23 ఆర్థిక సంఘంలో ఇచ్చిన ముందస్తు ప్రణాళిక ఆధారంగా 15వ ఆర్థిక సంఘం రెండవ విడత కింద రూ.9,88,50,562 నిధులు విడుదలయ్యాయి. దీంతో పంచాయతీల్లో ఇంతవరకు జరగని స్థాయిలో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి. మారుమూల ప్రాంతాలు, అనుబంధ గ్రామాలు, కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

నిధుల ఖర్చుకు విధివిధానాలు

పంచాయతీలకు నిధులు టైడ్, అన్‌టైడ్ కింద విడుదల అవుతాయి. టైడ్ కింద రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. అన్‌టైడ్ నిధులను తాగునీటి అవసరాలు, చేతిపంపులు, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణకు వాడాలి.



వరదయ్యపాళెం మండలంలోని మత్తేరిమిట్ట గ్రామ సచివాలయం

సత్యవేడు నియోజకవర్గంలో మండలాల వారీగా మంజూరైన నిధులు

మండలం	గ్రామ పంచాయతీలు	టైడ్ (లక్షల్లో)	అన్‌టైడ్ (లక్షల్లో)
బీఎన్‌కండ్రిగ	28	4483479	2988979
కేవీబీపురం	34	4734394	3156265
నాగలాపురం	19	4310002	2873331
పిచ్చాటూరు	21	3931813	2621206
సత్యవేడు	28	6174705	4116467
నారాయణవనం	19	4429629	2953082
వరదయ్యపాళెం	29	5459222	3639476
మొత్తం	178	33523244	22348806

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మండలాల వారీగా మంజూరైన నిధులు

మండలం	గ్రామ పంచాయతీలు	టైడ్ (లక్షల్లో)	అన్‌టైడ్ (లక్షల్లో)
శ్రీకాళహస్తి	35	4930287	3286853
తొట్టంబేడు	27	4995521	3330341
ఏర్పేడు	40	6791678	4527777
రేణిగుంట	19	8829639	5886416
మొత్తం	121	25547125	17031387

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి



విడుదలైన 15వ ఆర్థిక సంఘం రెండవ విడత నిధులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత ప్రకారం ప్రజల సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులకు ఉపయోగించిన నిధుల వివరాలు, బిల్లులను గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో నమోదు చేయాలి.

–ప్రసాద్, ఎంపీడీవో, వరదయ్యపాళెం

మత్తుకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

ఏర్పేడు: యువత మత్తుకు బానిసలు కారాదని ఏర్పేడు సీఐ జయచంద్ర అన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం మండలంలోని పాపానాయుడుపేటలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్‌తో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. పాపానాయుడుపేటలో యువకులు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి గంజాయి విక్రయిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వీటి వలన జీవితాలు నాశనం చేసుకోరాదని హితవు పలికారు.

19న తడ ఐటీఐలో జాబ్ మేళా

తడ: ఈ నెల 19వ తేదీన తడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. శ్రీసిటీలోని బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ప్రతినిధులు ఇంటర్వ్యూ చేస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన యువతీ యువకులు హాజరుకావచ్చని తెలిపారు. ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, బయోడేటా, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్(httpr:rkiuniverre.aprrdc.in)లో నమోదు చేసుకున్న అడ్మిట్ కార్డుతో జాబ్‌మేళాకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9154449677లో సంప్రదించాలని సూచించారు.





శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. 4వ రోజైన సోమవారం ఆలయ యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు స్వామినాథన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ప్రాయశ్చిత ఉపచార పూజలు చేసి, పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు పూజా ద్రవ్యాలను ఆలయంలో ఊరేగింపుగా ప్రదక్షిణలు చేసి శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తుల వద్దకు విచ్చేశారు. అక్కడ వేదపండితులకు పూజాద్రవ్యాలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

శ్రీకాళహస్తి రూరల్: అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించి శిక్షణ ఇవ్వాలని హార్టికల్చర్ డైరెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత ఉద్యాన నర్సరీని, అనంతరం తొండమానుపురంలోని రైతు బత్తిరెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటని సందర్శించారు. పంట ఎలా సాగు చేస్తున్నారో రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ, నాణ్యమైన మొక్కల పెంచి రైతులకు అందుబాటులో ఉంచాలని, నర్సరీ మొక్కల పెంపకంలో తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. రైతులకు అంతర పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇ–క్రాప్ నమోదు వంద శాతం పూర్తి చేయాలని, రైతులు ఆయిల్ పామ్ సాగుపై మొగ్గు చూపేలా అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కనీస మద్దతు ధర కలిగిన ఉద్యాన పంట ఇది ఒక్కటే అని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బి.దశరథరామిరెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్, ఉద్యాన అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



ఉద్యాన నర్సరీని పరిశీలిస్తున్న చేస్తున్న డైరెక్టర్ శ్రీనివాసులు

యంత్రంతో శ్రీవరి సాగు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పల్లమాలలోని రైతులు యంత్రంతో 20 ఎకరాల్లో శ్రీవరి పంటను సాగుచేస్తున్నారు. శ్రీవరిపంటను వేయడం వల్ల రైతులు అధిక దిగుబడిని సాధించవచ్చునని తెలిపారు. కూలీల అవసరం ఎక్కువగా లేకపోవడంతో శ్రీవరిని సాగు చేయడానికి మక్కువ చూపుతున్నారు. అంతేగాక తక్కువ మోతాదులో ఎరువులు వినియోగం ఉంటుందని తెలిపారు. ఎకరాకు ఐదు బస్తాల వరకు ధాన్యం దిగుబడి పెరుగుతుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే పల్లమాల, కారణి గ్రామాల్లో శ్రీవరిని రైతులు సాగుచేస్తున్నారు. శ్రీవరిలో కలుపు ఉండదని, లె గుళ్లు ఎక్కువగా రావని, ధాన్యం నాణ్యతగా ఉంటుందని తెలిపారు.

యంత్రం వేస్తున్న శ్రీ వరినాట్లు



పూర్వ విద్యార్థులు సమావేశం

నాగలాపురం: పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్న స్నేహితులను ఆదుకోవాలని నిర్ణయించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం గురువులను సన్మానించారు.



1990–91 సంవత్సరం పూర్వం విద్యార్థులు

తమ్మినపట్నంలో జాయింట్ కలెక్టర్ పర్యటన

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తమ్మినపట్నం పంచాయతీలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభమ్ భన్సల్ సోమవారం పర్యటించారు. గ్రామ సమీపంలో క్రిస్ సిటీ ఏర్పాట్లకు సంబంధించిన భూసేకరణను ఇటీవల పూర్తి చేశారు. క్రిస్ సిటీ భూమి పూజకు ప్రధాని నరేంద్రమోదీ రానున్నారు. ఈ క్రమంలో గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీలు ఈ ప్రాంతంలో పర్యటించి సభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అప్పట్లో ప్రధాని పర్యటన వాయిదా పడింది. తాజా గా ప్రధాని వస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే జాయింట్ కలెక్టర్ ఈ ప్రాంతంలో పర్యటించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. హెలిప్యాడ్, సభా వేదిక, శంకుస్థాపన శిలాఫలకం, భద్రతకు సంబంధించిన పూర్తి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం సాయంత్రం ఆటోను లారీ ఢీకొంది. బాధితుల కథనం మేరకు.. వాకాడు మండలం గొల్లపాళెంకు చెందిన కొంత మంది రైతులు ఆటోలో నాయుడుపేటకు వచ్చి వరి ధాన్యం కొనుగోలు చేశారు. బస్తాలను ఆటోలో వేసుకుని గొల్లపాళెం బయలుదేరారు. నాయుడుపేట సమీపంలోని జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఆటో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ఆటోను పక్కకు తిప్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికి ఆటో ముందు భాగం దెబ్బతిని రైతులు కృష్ణయ్య, మనెయ్య, కస్తూరయ్య, హరి, ఆటో డ్రైవర్ గురువయ్య స్వల్పంగా గాయపడ్డారు. హైవే పోలీసులు అక్కడికి చేరుకుని లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మినీ లారీ బోల్తా

చిల్లకూరు : మండలంలోని రైటార్ సత్రం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం మినీ లారీ బోల్తాపడి డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. లారీ అద్దాలు తీసుకుని నెల్లూరు నుంచి నాయుడుపేటకు వెళుతోంది. రైటార్ సత్రం సమీపంలో ముందు టైర్ పంక్చర్ అయి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్ సుజిత్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. స్వర్ణా టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని డ్రైవర్‌ను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కంపు కొడుతున్న చెత్త

శ్రీకాళహస్తి: పట్టణంలోని పాత బలరామ్ సినిమా థియేటర్‌కు వెళ్లే మార్గం చెత్తపేరుకుపోయి దుర్గంధం చిమ్ముతోంది. నిత్యం ఈ మార్గంలో పాదచారులే కాకుండా వాహనాలు, పాదచారులేకాకుండా ద్విచక్రవాహనాలు, కార్లు తిరుగుతుంటాయి. సమీపంలోనే కల్యాణ మండపం కూడా ఉంది. ఇక్కడ చెత్త పేరుకుపోతున్నా తొలగించడం లేదని మున్సిపల్ అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతున్నారు.



పేరుకుపోయిన చెత్త

వరదయ్యపాళెం ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో ...





పిచ్చి మొక్కల మధ్య వ్యవసాయ కార్యాలయం



అపరిశుభ్రంగా ఉన్న వెలుగు కార్యాలయ పరిసరాలు

పిచ్చిమొక్కల నడుమ ప్రభుత్వ కార్యాలయాలు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలోని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారాయి. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. అధికారులు కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నారు తప్ప పరిసరాలను శుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. స్వచ్ఛ సేవ కార్యక్రమం ద్వారా అయినా ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేసుకుంటారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న స్వచ్ఛ సేవ కార్యక్రమం విజయవంతం చేయాలని పదేపదే అధికారులు పిలుపునిస్తున్నారు. వారు ప్రాతినిధ్యం వహించే కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలన్న ఆలోచన రాకపోవడంపై మండల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, శ్రీశక్తి భవన్, వ్యవసాయ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో విష సర్పాలు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. అదేవిధంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని పేర్కొంటున్నారు.